తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీ లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, రవీందర్‌నాయక్, భిక్షమయ్యగౌడ్

పదవి కోసం మోదీకి రేవంత్ భజన

- ఢిల్లీకి పోయివచ్చినంక ట్రెండ్ మార్చిండు
- కాంగ్రెస్ హయాంలో తెలంగాణ అధోగతి
- సర్కారు నిర్లక్ష్యంతోనే ఎస్ఎల్‌బీసీ ప్రమాదం
- 10 రోజుల తర్వాత వెళ్లి సీఎం చిల్లర మాటలు
- ముఖ్యమంత్రి రేవంత్‌పై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫైర్

> రేవంత్‌కు పాలనపై పట్టులేదు.. ప్రజలంటే కమిట్‌మెంట్ లేదు.. మంత్రులకు శాఖలపై అవగాహన లేదు. కనీసం 15 రోజులకోసారైనా సమీక్ష చేయడం లేదు..సమస్యలను పక్కదారి పట్టించేందుకు ముఖ్యమంత్రి తన అనుకూల మీడియాలో ప్రచారం కోసం చిల్లర మాటలు మాట్లాడుతున్నడు.
> –జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ తన పదవిని, ఆస్తులను కాపాడుకొనేందుకే ప్రధాని మోదీకి భజన చేస్తున్నాడని..ఢిల్లీకి పోయివచ్చిన తర్వాత ట్రెండ్ మార్చాడని.. కిషన్‌రెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర నాయకులపై అదేపనిగా విమర్శలు గుప్పిస్తూ బీజేపీలో ఏటీం, బీటీం ఉన్నాయని చెప్పకనే చెప్తున్నాడని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఈ విషయం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి అర్థమైతుందో? లేదో?నని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ 15 నెలల పాలనలో రాష్ట్రం అన్నింటా అధోగతి పాలైందని, పాలన రివర్స్‌గేర్‌లో పోతున్నదని దుయ్యబట్టారు. సోమవారం తెలంగాణభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఎల్‌బీసీ ప్రమాదం ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. ఘటన జరిగి పదిరోజులైనా ప్రభుత్వం వాస్తవాలను వెల్లడించకుండా ఎందుకు దాచిపెడుతున్నదని ప్రశ్నించారు. సీఎం పదిరోజుల తర్వాత ఘటనాస్థలానికి వెళ్లి చిల్లర మాటలు మాట్లాడాన్ని చూస్తే అసహ్యమేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. హరీశ్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసి అక్కసు వెళ్లగక్కడం ఎందుకని నిలదీశారు. ఆయన దుబాయ్ వెళ్లడాన్ని తప్పుపడుతున్న రేవంత్‌రెడ్డి..అదే కార్యక్రమానికి మంత్రులు కూడా హాజరైన విషయాన్ని మరిచిపోవడం విడ్డూరమన్నారు. పదిరోజులైనా ఈ ప్రమాదానికి పరిష్కారం చూపకుండా బూతులు వల్లించడం రేవంత్‌కే చెల్లిందని దెప్పిపొడిచారు.

శ్రీశైలం ఘటనపై పచ్చి అబద్ధాలు

ఎస్ఎల్‌బీసీ ప్రమాదస్థలికి వెళ్లిన రేవంత్‌రెడ్డి కార్మికులను కాపాడే విషయంలో స్పష్టమైన ప్రకటన చేయకుండా బీఆర్ఎస్‌పై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. గతంలో శ్రీశైలం హైడల్ ప్రాజెక్టులో ప్రమాదం జరిగితే అప్పటి ప్రభుత్వం వేగంగా స్పందించిందని చెప్పారు. తాను విద్యుత్తు అధికారులతో కలిసి కొన్ని గంటల్లోనే వెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు. '24 గంటల్లోనే డెడ్‌బాడీలను కుటుంబసభ్యులకు అప్పగించినం. రూ. కోటి చొప్పున పరిహారం ఇచ్చినం. బాధిత కుటుంబాల్లో ఒక్కొక్కరికి ఉద్యోగం కల్పించినం.. ఇది మా కమిట్‌మెంట్‌కు నిదర్శనం' అని చెప్పారు. రెండు మూడు నెలల్లోనే ప్రాజెక్టును పునరుద్ధరించామని గుర్తుచేశారు. ఇదేమీ తెలియకుండా ముఖ్యమంత్రి అడ్డదిడ్డంగా మాట్లాడి అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారని ఎద్దేవాచేశారు. ప్రాణాలకు తెగించి ప్రాజెక్టును రక్షించిన విద్యుత్తు అధికారులు, సిబ్బందిని అవమానించేలా మాట్లాడటం బాధాకరమన్నారు.

> పది రోజుల తర్వాత ఘటనాస్థలానికి వెళ్లి ముఖ్యమంత్రి చిల్లర మాటలు మాట్లాడడం చూస్తే అసహ్యమేస్తున్నది. పదిరోజులైనా ఈ ప్రమాదానికి పరిష్కారం చూపకుండా బూతులు వల్లించడం రేవంత్‌కే చెల్లింది.
> – జగదీశ్‌రెడ్డి

24 గంటల కరెంటిస్తే రాజీనామా

కాంగ్రెస్ పాలనలో వేసవిరాకముందే నీళ్లు, కరెంట్ కష్టాలు మొదలయ్యాయని జగదీశ్‌రెడ్డి వాపోయారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాత్రం రికార్డుస్థాయిలో కరెంట్ ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు. సాగు, గృహాలకు 24 గంటల కరెంటు ఇస్తున్నట్టు రుజువుచేస్తే తాను రాజీనామాకు సిద్ధమని ప్రకటించారు. నాణ్యత లేని కరెంట్‌తో మోటర్లు కాలిపోతున్నాయని, పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం నీటిని వినియోగించుకొనే అవకాశమున్నా పట్టించుకోవడం లేదని, కేసీఆర్‌ను బద్నాం చేయాలనే నెపంతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నదని నిప్పులు చెరిగారు. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కాళేశ్వరం ద్వారా ఎత్తిపోతలపై దృష్టిపెట్టాలని సూచించారు. సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, భిక్షమయ్యగౌడ్, నాయకులు రమావత్ రవీందర్‌కుమార్, తుంగ బాలు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల పనులు పూర్తి చేయాలి

మంత్రి రాజనర్సింహ

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మెడికల్ కాలేజీల పనులు త్వరగా పూర్తి చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సోమవారం ఆయన ఆరోగ్య శ్రీ ట్రస్ట్ కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

మరో ఐడీటీఆర్ ఏర్పాటు చేయలేం

మంత్రి పొన్నం లేఖపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ స్పందన

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో మరో ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ అండ్ ట్రాఫిక్ రీసెర్చ్ (ఐడీటీఆర్) ఏర్పాటుకు అవకాశాలు లేవని కేంద్ర రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. రవాణాశాఖలోని పలు అంశాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ పంపిన లేఖపై స్పందించిన నితిన్‌గడ్కరీ.. సోమవారం ఓ లేఖను విడుదల చేశారు. 2.5 కోట్ల జనాభాకు ఒక ఐడీటీఆర్‌కి మాత్రమే అర్హత ఉంటుందని, ఇప్పటికే కరీంనగర్‌లో ఐడీటీఆర్ పని చేస్తున్నదని గడ్కరీ స్పష్టం చేశారు. 3 ప్రాంతీయ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలు(ఆర్‌డీటీసీఎస్), ఒక డ్రైవింగ్ శిక్షణ కేంద్రం (డీటీఎస్) కోసం రాష్ట్రం అర్హత సాధించిందని తెలిపారు. వీటి ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపొచ్చని పేర్కొన్నారు.

పనితీరుపై మోదీ ఆత్మపరిశీలన చేసుకోవాలి: సీపీఐ

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీ ఆయన పనితీరుపై లోతైన ఆత్మపరిశీలన చేసుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ అన్నారు. ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ గ్రాఫ్ పడిపోవడం చూశామని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ ఇమేజ్ పెరుగుతుంటే పార్లమెంట్ సీట్ల సంఖ్య 303 నుంచి 242కు ఎందుకు పడిపోయిందని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో నారాయణ ప్రశ్నించారు.

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న కవిత

మహిళలకు 2500 ఇచ్చేదాక వదలం

- హామీలపై 8 లోగా ప్రకటన చేయకుంటే సోనియాకు లక్షల పోస్ట్‌కార్డులు పంపుతాం
- వరంగల్ ఎయిర్‌పోర్టుకు రాణి రుద్రమదేవి పేరు పెట్టాలి
- హామీల అమలును కోరుతూ రేవంత్‌కు పోస్ట్‌కార్డుల ఉద్యమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా లోకాన్ని మోసం చేయాలని ప్రయత్నం చేస్తే కాంగ్రెస్ పార్టీని మట్టికరిపిస్తామని హెచ్చరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 8వ తేదీలోగా మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వడంతోపాటు అన్ని హామీలపై కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వరంగల్‌లో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయానికి రాణి రుద్రమదేవి పేరు పెట్టాలని సూచించారు. మహిళలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవటంలో భాగంగా కవిత సోమవారం పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 10 వేల పోస్టు కార్డులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హామీల అమలుపై మార్చి 8లోగా ప్రకటన చేయకపోతే 10 వేల మంది మహిళలం 10 వేల గ్రామాల్లోకి వెళ్తామని, అన్ని గ్రామాల్లో మహిళలను కూడగట్టి లక్షలాది పోస్టుకార్డులను తయారు చేసి సోనియాగాంధీకి పంపిస్తామని తెలిపారు. మహిళల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మానవీయంగా ఆలోచించడం లేదని, మహిళలను మభ్యపెట్టి మోసం చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

మహిళా బిల్లుపై మాట్లాడింది మేమే

సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ మాట్లాడక ముందే మహిళా బిల్లు కోసం తెలంగాణ జాగృతి ఢిల్లీలో ధర్నా చేసిందని ఎమ్మెల్సీ కవిత గుర్తు చేశారు. మహిళా బిల్లు రావడంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర లేదని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రానికి చెందిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటులో మహిళా అంశాలపై ఎందుకు మాట్లాడడంలేదని నిలదీశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనకు ఆయన ప్రారంభించిన పెట్రోల్ పంప్‌కు పోలిక లేదని విమర్శించారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లాకు ఒక పెట్రోల్ పంపును ఏర్పాటు చేయిస్తే ఆ జిల్లాలో ఉండే వేల మంది మహిళా సంఘాల సభ్యులకు పెద్దగా లాభం ఉండదని, అందువల్ల మహిళలకు నెలకు రూ. 2500 ఇచ్చే కార్యక్రమాన్ని తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. యువతులకు స్కూటీలు పంపిణీ చేస్తామన్న హామీని అమలు చేయాలని, ఈ పథకాలన్నింటినీ మార్చి 8న ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

రుణ పరిమితిని పెంచాలి

వడ్డీలేని రుణాల పరిమితిని 20 లక్షలకు పెంచుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలని కవిత డిమాండ్ చేశారు. అభయహస్తం నిధులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై నేరాల శాతం 20% పెరిగిన విషయాన్ని డీజీపీ వెల్లడించారని, ఆడబిడ్డలకు రక్షణపై ప్రభుత్వం సమీక్షించి ప్రకటన చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్మికుల జీతాలను పెంచుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ విస్మరించిందని ఆరోపించారు.

సిద్దిపేటలో సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రం

- మార్కెట్ యార్డులో ప్రారంభించిన అదనపు కలెక్టర్
- త్వరలో మరో ఆరుచోట్ల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖతో దిగివచ్చిన రేవంత్ ప్రభుత్వం

సిద్దిపేట, మార్చి 3: మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖకు ప్రభుత్వం స్పందించింది. ప్రభుత్వం సన్‌ఫ్లవర్ కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారులకు పంటను అమ్మి నష్టపోతున్నారని, వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని హరీశ్‌రావు ఆదివారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. కొనుగోలు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని లేఖలో పేర్కొన్నారు. హరీశ్‌రావు లేఖ ప్రభావంతో సోమవారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో 2024-25 యాసంగి సీజన్‌కు సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సన్‌ఫ్లవర్ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించి క్వింటాలుకు మద్దతు ధర రూ.7,280 పొందాలని సూచించారు. సిద్దిపేట జిల్లాలో 11,193 ఎకరాల్లో సన్‌ఫ్లవర్ సాగు అయినట్టు తెలిపారు. హుస్నాబాద్, బెజ్జంకి, గజ్వేల్, తొగుట, చిన్నకోడూర్, అక్కన్నపేటలో సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను స్థానిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ప్రారంభిస్తామని చెప్పారు.

సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

బీసీల పోరులో విద్యార్థులు కలిసిరావాలి

- 8న ఓబీసీ యూత్ లీడర్‌షిప్ సమ్మిట్
- కులగణనకు కేంద్రంపై ఒత్తిడి తెద్దాం
- మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పిలుపు

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): బీసీల డిమాండ్ల సాధన పోరాటంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. శంషాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో సోమవారం ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోని సావిత్రీబాయి పూలే ఆడిటోరియంలో మార్చి 8న నిర్వహించనున్న ఓబీసీ యూత్ లీడర్‌షిప్ సమ్మిట్-2025 పోస్టర్‌ను ఓబీసీ మేధావులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఓబీసీ విద్యార్థులకు విద్యా, ఉద్యోగాల రిజర్వేషన్లలో జరిగే అన్యాయాలపై పోరాడాలని సూచించారు. జనాభా దామాషా ప్రకారం ఓబీసీలకు చట్టసభల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్ల సాధనకు పాటుపడాలని కోరారు. బీసీల జనాభా విషయంలో కచ్చితమైన లెక్కతేల్చకపోవడం వెనుక భారీ కుట్ర దాగి ఉన్నదని విమర్శించారు. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేసే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దామని తెలిపారు. ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో యువత రాణించేలా మార్గనిర్దేశం చేసేందుకు యూత్ లీడర్‌షిప్ సమ్మిట్ 2025 సదస్సు దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ ఓబీసీ నేత, బీపీ మండల్ మనమడు ప్రొఫెసర్ సూరజ్‌యాదవ్ మండల్, ఉత్తరప్రదేశ్ మాజీ ఎంపీ శ్యామ్‌సింగ్ యాదవ్, ఒడిశా ఎంపీ సుమిత్ పాత్ర, ఆంధ్రప్రదేశ్ ఎంపీలు మస్తాన్‌రావు, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సందీప్‌కుమార్, బనారస్ హిందూ యూనివర్సిటీ ఓబీసీ నాయకులు ప్రొఫెసర్ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా కేటాయించండి

- గోదావరి నికర జలాల వాటా తేల్చండి
- ప్రాజెక్టులకు క్లియరెన్స్‌లతోపాటు భారీగా ఆర్థికసాయం చేయండి
- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి

కేంద్ర మంత్రి పాటిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధమైన వాటా కేటాయించాలని కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గోదావరిలో నికర జలాల వాటాను కూడా తేల్చాలని కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి పాటిల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం ప్రత్యేకంగా కలిశారు. కృష్ణా, గోదావరి నదీజలాలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కృష్ణా పరివాహక ప్రాంతం తెలంగాణలో ఎక్కువగా ఉన్నప్పటికీ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పక్షపాతంగా వ్యవహరిస్తున్నదని, ఆంధ్రప్రదేశ్‌కు 66 శాతం, తెలంగాణకు 34 శాతం నీటి కేటాయింపులు చేసిందని కేంద్రమంత్రికి వివరించినట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాది సైతం ఏపీ తమకు కేటాయించిన మొత్తానికి మించి నీటిని తరలించుకుపోయిందని, ఇకనైనా మళ్లింపును అడ్డుకోవాలని, అందుకు టెలిమెట్రీ యంత్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ ఎత్తిపోతలు, సమ్మక్క సాగర్ బరాజ్‌లకు అనుమతులు ఇప్పించాలని కేంద్రమంత్రిని కోరామని వెల్లడించారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఏపీ సర్కారు గోదావరి-బనకచర్ల అనుసంధాన పథకానికి రూపకల్పన చేసిందని ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. గోదావరిలో తెలంగాణకు సంబంధించి నికరజలాల వాటాను తేల్చాలని, లేదంటే ఆయకట్టు స్థిరీకరణ పేరుతో నష్టపోతామని వివరించినట్టు తెలిపారు. తెలంగాణ ప్రాజెక్టులకు సత్వర సాగునీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ)తోపాటు పలు పథకాల కింద ఆర్థికసాయం చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. తుమ్మిడిహెట్టి నుంచి ప్రాణహిత -చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని, ముంపునకు సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు ఇప్పించాలని కోరినట్టు వెల్లడించారు. సమావేశంలో ఎంపీ రఘువీర్‌రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, నీటి పారుదలశాఖ ఈఎన్సీ (ఓఅండ్ఎం) విజయ్ భాస్కర్‌రెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ్ ఈజ్ ది రైట్ పర్సన్!

హైదరాబాద్, మార్చి 3(నమస్తే తెలంగాణ): 'హీ ఈజ్ ది రైట్ పర్సన్' అంటూ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం ఢిల్లీ పర్యనలో భాగంగా కేంద్ర మంత్రి పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అక్కడున్న ఇంగ్లిష్ మీడియా ప్రతినిధులు కేంద్ర మంత్రితో జరిగిన భేటీపై మాట్లాడాల్సిందిగా రేవంత్‌రెడ్డిని కోరారు. ఇందుకు నిరాకరించిన రేవంత్‌రెడ్డి.. 'హీ ఈజ్ ది రైట్ పర్సన్' అంటూ ఉత్తమ్ వైపు చూపించారు. దీంతో భేటీపై మంత్రి ఉత్తమ్ మీడియాకు వివరించారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి కేంద్ర మంత్రితో జరిగిన విషయాలను వెల్లడించకుండా మంత్రితో చెప్పిచడం ఏమిటన్న ప్రశ్నలు వినిపించాయి.

ఖజానా ఖాళీ.. ఆశలు భారీ!

- బడ్జెట్‌లో రూ.17,448 కోట్లకు వైద్యశాఖ ప్రతిపాదనలు
- నిరుడు రూ.10,996 కోట్లతో సరిపెట్టిన రేవంత్ సర్కారు

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఆదాయం అంతంత మాత్రాన ఉన్న వేళ బడ్జెట్ కేటాయింపులపై వైద్య శాఖ గంపెడాశలు పెట్టుకున్నది. అసెంబ్లీలో ఈ నెల మూడో వారం 2025-26 వార్షిక బడ్జెట్ సమావేశాలు జరుగునుండటంతో వైద్య శాఖతోపాటు ఇతర కీలక శాఖలకు జరపాల్సిన కేటాయింపులపై ఆర్థికశాఖ ఇప్పటికే కసరత్తు పూర్తి చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం వైద్యశాఖకు జరపాల్సిన కేటాయింపులపై తర్జనభర్జన పడుతున్నది. బడ్జెట్ కేటాయింపులపై వైద్యశాఖ పెట్టుకున్న ఆశలను ప్రభుత్వం ఎలా నేరవేరుస్తుందన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. నిరుడు బడ్జెట్‌లో రూ.10,996 కోట్లు కేటాయించారు. 2025-26 వార్షిక బడ్జెట్‌లో తమకు రూ.17,448 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి వైద్యశాఖ ప్రతిపాదించింది.

బిల్లులు చెల్లించే వరకు పనులు చేయం

- సర్కారుకు తేల్చిచెప్పిన కాంట్రాక్టర్లు
- ఆర్‌అండ్‌బీలో 600 కోట్ల పెండింగ్
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని నిలదీసిన కాంట్రాక్టర్లు
- నిలిచిపోయిన రోడ్ల నిర్మాణాలు
- మరమ్మతుల్లోనూ తీవ్రజాప్యం
- అధ్వానంగా మారిన రహదారులు

పెండింగ్ బిల్లులు ఇలా..

మెయింటెనెన్స్	ప్లాన్ వర్క్స్
200 కోట్లు	400 కోట్లు

మొత్తం 600 కోట్లు

బడ్జెట్‌లో కేటాయింపులు ఇలా..

ప్లాన్ కింద నిధులు	నాన్ ప్లాన్ కింద
518 కోట్లు	888 కోట్లు

మంజూరు చేసింది 15 కోట్లు

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): ఆర్‌అండ్‌బీ శాఖలో పేరుకుపోయిన పెండింగ్ బకాయిలు చెల్లించే వరకు పనులు చేయబోమని కాంట్రాక్టర్లు స్పష్టంచేశారు. రూ.600 కోట్ల వరకు బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో కాంగ్రెస్ సర్కారుకు వారు తేల్చిచెప్పారు. ఆర్‌అండ్‌బీ శాఖ ప్రధాన కార్యాలయానికి వెళ్లి ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని నిలదీశారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని ఆర్‌అండ్‌బీ శాఖ ప్రధాన కార్యాలయంలో సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులతో సమావేశమయ్యారు. బిల్డర్స్ అసోసియేషన్ మాజీ చైర్మన్లు డీవీఎన్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, కోశాధికారి సంతోశ్‌రెడ్డి, సంపత్‌రావు, కృష్ణారావు తదితరులు మంత్రిని కలిశారు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.100 కోట్ల బిల్లులు ఉన్నాయని, వెంటనే మంజూరు చేయాలని కోరారు. త్వరలో ముఖ్యమంత్రితో మాట్లాడి మార్చి చివరి వారంలోగా బిల్లులు చెల్లించేలా చూస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

15 కోట్లు మాత్రమే మంజూరు

రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ శాఖలో బిల్లులు పేరుకుపోయాయి. దీంతో కాంట్రాక్టర్లు కొత్త పనులు చేసేందుకు వెనకాడుతున్నారు. బిల్లుల కోసం కాంట్రాక్టర్లు నిత్యం ఆర్‌అండ్‌బీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేకుండాపోయింది. కొత్త పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు సైతం పాత బిల్లులు చెల్లించేవరకు కొత్త పనులు చేపట్టేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఫలితంగా కొత్త రోడ్ల నిర్మాణాలతో పాటు మరమ్మతుల పనుల్లోనూ తీవ్ర జాప్యం ఏర్పడుతున్నది. వానకాలంలో పోటెత్తిన వరదలకు రాష్ట్రంలో భారీగా రోడ్లు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో ఆర్‌అండ్‌బీ శాఖ నష్టాన్ని అంచనా వేసి భారీగా నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరింది. కానీ, ప్రభుత్వం మాత్రం రూ.15 కోట్లు మాత్రమే మంజూరు చేసి చేతులు దులుపుకొన్నది. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

నిధుల కోసం వెంపర్లాట

మొదటిపేజీ తరువాయి...

ఏర్పాటు చేసి వేలం పాట నిర్వహించేందుకు కన్సల్టెంట్ నియామకానికి (ఆర్ఎఫ్‌పీ) టెండర్లు పిలిచింది. లేఔట్ మాస్టర్ ప్లాన్ తయారీ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వేలం ద్వారా ప్లాట్ల విక్రయాలు తదితర కార్యక్రమాల నిర్వహణ కోసం లావాదేవీ సలహా కన్సల్టెంటు నియామకానికి రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ)ని ఆహ్వానించారు. ఈ నెల 15 వరకు బిడ్ల దాఖలుకు గడువిచ్చారు. క్వాలిటీ కమ్ కాస్ట్ బేస్డ్ సెలక్షన్ (క్యూసీబీఎస్) పద్ధతిలో బిడ్డర్‌ను ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు. అయితే, ఇవే భూములను బ్యాంకర్లకు కుదువ పెట్టి రూ.10 వేల కోట్ల రుణాలు సమకూర్చుకునేందుకు ప్రభుత్వం గతంలో యత్నించింది. ఒక కన్సల్టెంట్‌ను నియమించింది. 400 ఎకరాలను ప్రైవేటు బ్యాంకులకు కుదువపెట్టి నిధులు సమీకరించుకుంది. ఆ సమయంలో జరిగిన ఒప్పందంలో ఒక క్లాజ్ పెట్టారు